www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

**అసెంబ్లీలో సంపూర్ణమైన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చి తక్షణమే అమలు చేయాలి** 3



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 282 | మంగళవారం | 18- 03 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## గంటకి వెయ్యి కి.మీ ప్రయాణం



**తొలిఅడుగు** డెస్క్ : కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తాజా గా మద్రాస్ ఐఐటీకి వెళ్లారు. అక్కడ ఉన్న హైపర్‌లూప్ టెస్టింగ్ విభాగాన్ని సందర్శించారు. హైపర్‌లూప్ ట్యూబ్‌కు సంబంధించి అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతో 2

## లోక్‌సభలో హిందూ ఆలయాల నిధులపై చర్చ



**తొలిఅడుగు, న్యూఢిల్లీ :** హిందూ ఆలయాలపై ప్రభుత్వాల నియంత్రణ గురించి లోక్‌సభలో కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చర్చించారు. హిందూ ఆలయాలు రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణలో, ఇతర మతాల ప్రార్థనా స్థలాలు స్వతంత్రంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల 2

## సినీ నటులకు బిగ్ షాక్



**తొలిఅడుగు, హైదరాబాద్ :** బెట్టింగ్ యాప్‌ల బారినపడుతున్న బాధితులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలాంటి వారి మృతికి తప్పుడు వస్తువులను ప్రచారం 2

# బీసీ బిల్లులకు శాసనసభ ఆమోదం

- వెనకబడిన వర్గాల కోటా 29 నుంచి 42 శాతానికి
- సర్పంచ్ నుంచి మేయర్ దాకా.. విద్య, ఉద్యోగాల్లోనూ
- నేడు మండలికి.. ఆమోదం తర్వాత గవర్నర్‌కు
- ఆయన పరిశీలించి రాష్ట్రపతికి పంపిస్తారు
- పార్లమెంటులో 2/3 మెజారిటీతో ఆమోదం తప్పనిసరి
- రిజర్వేషన్ల తేనెతుట్టెను కేంద్రం కదుపుతుందా!?




**తొలిఅడుగు, హైదరాబాద్ :** స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. దాంతో, మంగళవారం వాటిని శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. అనంతరం వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపనుంది. ఆయన వాటిని పరిశీలించి.. రాష్ట్రపతికి పంపనున్నారు. తొలుత.. 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు–2025', 'తెలంగాణ బీసీ (స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు) బిల్లు–2025'ను మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు 29 2

## ఔరంగజేబు సమాధిపై రచ్చ..



**తొలిఅడుగు, డెస్క్ :** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఉన్న ఔరంగజేబు సమాధిని కూల్చివేయాలనే డిమాండ్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరాఠా భూమిపై దీనికి స్థానం లేదని ఇప్పటికే పలువురు నాయకులు వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఔరంగజేబు సమాధిని ధ్వంసం 2

## పోసాని కృష్ణమురళికి మరో షాక్



**తొలిఅడుగు, అమరావతి :** టీడీపీ కేంద్ర కార్యాలయంలో పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం కల్లూరుకు చెందిన కె. సత్యనారాయణ శెట్టి సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చారు. పోసాని కృష్ణమురళీ, మహేశ్ అనే వ్యక్తులు వైసీపీ ప్రభుత్వం హయాంలో తనకు ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 9 లక్షలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై గచ్చిబౌలిలో కేసు పెట్టినా తనకు ఎటువంటి న్యాయం జరగలేదని చెప్పారు. డబ్బులు మోసపోవడంతో ఐదేళ్లనుండి తన 2

## భార్యపై పెట్రోల్ పోసి సజీవదహనం చేసిన భర్త




**తొలిఅడుగు, గోల్నాక :** పచ్చని సంసారంలో అనుమానం చిచ్చుపెట్టింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను సజీవదహనం చేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసి పోలీసులకు దొరికిపోయాడు. ఈ దారుణ ఘటన అంబర్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్ పేట పటేల్ నగర్ బిలాల్ మజీదు బస్తీకి చెందిన నవీన్ (32), రేఖ (28) భార్యాభర్తలు. వీరికి ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు 2

## వాస్తవాలను వినే పరిస్థితిలో వైసీపీ లేదు



**తొలిఅడుగు, అమరావతి :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వాస్తవాలను వినే పరిస్థితిలో వైసీపీ లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికసాయంపై మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నలకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమాధానం ఇచ్చారు. 2

## ఇకపై అలా చేశారంటే వేలల్లో ఫైన్



**తొలిఅడుగు, హైదరాబాద్ :** కోటిమందికి పైగా జనాభా.. అసలే ఎండాకాలం.. జలమండలి ఇచ్చే తాగునీరు సరిపోని పరిస్థితి. ఈ క్రమంలో జలమండలి చర్యలు చేపట్టింది. అందరికీ తాగునీరు అందించాలని.. కీలక ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీళ్లు ఇస్తున్నా, మరికొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీళ్లిస్తూ.. అందరికీ దాహార్తిని తీర్చే ప్రయత్నం చేస్తున్నారు 2

## తిరుమలలో మరోసారి భద్రతా వైఫల్యం



**తొలిఅడుగు, తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో భద్రతా వైఫల్యం మరోసారి బయటపడింది. ఇటీవల కాలంలో కొంతమంది భక్తులు మొబైల్‌తో ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించారని, అలాగే ఆలయ మాడవీధుల్లో సీఎంవో వాహనం ప్రవేశించిందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. టీటీడీ భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఏపీ సాధు 2

## అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ కొరడా




**తొలిఅడుగు, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే యాక్షన్ తీసుకుంటున్నారు. తాజాగా జూబ్లీహిల్స్, రహమత్ నగర్‌లో జీహెచ్ఎంసీ టౌన్ 2

# గంటకి వెయ్యి కి.మీ ప్రయాణం



మొదటిపేజీ తరువాయి

తీరును పరిశీలించారు. హైపర్‌లూప్ ట్యూబ్ పాడ్ ప్రయాణించిన తీరుకు ఆయన ఖుషీ అయిపోయారు. సంతోషంతో కేరింతలు కొట్టారు. హైపర్‌లూప్ ట్యూబ్‌కు సంబంధించిన వీడియోను తన ఇన్‌గ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ‘ మద్రాస్ ఐఐటీలో హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగం 410 మీటర్ల పొడవుతో ఉంది. అది ఏషియాలోనే పొడవైన హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగంగా పేరుగాంచింది. ఆ పొడవును మరింత పెంచనున్నాము. అప్పుడది ప్రపంచంలోనే పొడవైన హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగంగా ప్రసిద్ధికెక్కుతుంది’ అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై నెటిజన్లు మిశ్రమంగా స్పందిస్తున్నారు. ముందు లోకల్ ట్రైన్‌లను సక్కాగా నడపండి.. అంటూ కామెంట్లు పెడుతున్నారు.

మద్రాస్ ఐఐటీ ఏడేళ్లనుంచి హైపర్ లూప్ టెక్నాలజీపై పని చేస్తోంది. పరిశోధనలు చేయడానికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తోంది. అంతేకాదు.. తాజాగా, గ్లోబల్ హైపర్ లూప్ కాంపిటీషన్ పేరిట ఓ కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. రైల్వే శాఖ 2022 మే నెలలో హైపర్ లూప్ టెక్నాలజీ అభివృద్ధి కోసం ఐఐటీ మద్రాస్‌కు 8.34 కోట్ల రూపాయల్ని కేటాయించింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన సందర్శన సందర్భంగా.. హైపర్ లూప్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఇండియా సిద్ధంగా ఉండాలని అన్నారు. హైపర్‌లూప్ టెస్టింగ్ విభాగంలో పరిశోధనలు చేస్తున్న యువతకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఔరంగజేబు సమాధిపై రచ్చ..

మొదటిపేజీ తరువాయి

చేసేందుకు కొందరు మూకుమ్మడిగా దాడి చేస్తారనే సమాచారం పోలీసులకు అందింది. ఇలాంటి పరిస్థితులు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యకు దారి తీస్తాయనే ఉద్దేశంతో సమాధి వద్ద భారీ బలగాలను మోహరించింది ప్రభుత్వం. మహారాష్ట్రలో ఔరంగజేబు సమాధి చుట్టూ రాజకీయ, మతపరమైన వివాదాలు ముదిరాయి. ఇప్పటికే ఆ రాష్ట్ర సీఎం సహా పలువురు రాజకీయ నాయకులు సమాధిని కూల్చివేయడమే మంచిదని అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీ నేత అబూ అజ్మీ ఇటీవల ఔరంగజేబు పాలనను ప్రశంసించడంతో పరిస్థితి ఇంకా దిగజారింది. దీంతో, సమాధి భద్రతకు ముప్పు పెరిగింది. ఓ గుంపు సమాధిపై దాడి చేయవచ్చనే సమాచారం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనేక మితవాద సంస్థలు సమాధిని కూల్చివేస్తామని బెదిరించడం వల్ల అక్కడ భారీగా భద్రతా బలగాలను మోహరించారు.

# సినీ నటులకు బిగ్ షాక్

మొదటిపేజీ తరువాయి

చేస్తున్న యూట్యూబర్లు, సెలబ్రిటీలు కూడా ఒక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రముఖులు బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తుండటంతో యువత వీటికి వెంటనే ఆకర్షితులు అవుతున్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల ఎంతగానో నష్టపోతున్నారు. క్రమంగా అప్పుల పాలై జీవితాన్ని చాలిస్తున్నారు. ఇలాంటి యాప్‌లు సమాజానికి చాలా నష్టం కలిగిస్తుండటంతో పోలీసులు వీటిపై ఫోకస్ పెట్టారు. వీటిని ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. విష్ణుప్రియ, సుప్రీత, ఇమ్రాన్ ఖాన్ (పరేషన్ బాయ్స్), హర్ష సాయి, రీతు చౌదరి, టేస్టీ తేజతో సహా 11 మంది నటులు, సోషల్ మీడియా ప్రభావశీలులపై కేసు నమోదు చేశారు.

# ఇకపై అలా చేశారంటే వేలల్లో ఫైన్

జలమండలి అధికారులు. ఇదే సమయంలో తాగునీటిని వృథా చేసే వారిపై కఠిన చర్యలకు దిగుతున్నారు. తాగునీటిని టూవీలర్లు, కార్లను వాష్ చేయడానికి వాడే వారికి పట్టుకుని ఫైన్ వేస్తున్నారు. సమ్మర్‌లో నీటి వృథాను అరికట్టేందుకు ఔటర్ రింగ్ రోడ్డు లోపల జలమండలి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో తన ఇంటి ముందు తాగునీటితో బైక్ వాష్ చేసిన వ్యక్తికి వెయ్యి రూపాయలు జరిమానా వేయగా.. తాజాగా ఇలాంటి పనే చేసిన వ్యక్తికీ కూడా వెయ్యి రూపాయల ఫైన్ వేశారు. తాగునీటి వృథాపై జలమండలికి ఫిర్యాదులు భారీగా అందుతున్నాయి. కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నేరుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో జీఎంలు తమ పరిధిలో.. తాగునీరు సరఫరా చేసే సమయంలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తున్నారు. ఎవరైనా తాగునీరు వృథా చేసినట్లు గమనిస్తే.. వెంటనే నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు. ఈ క్రమంలో డివిజన్-6 జీఎం హరిశంకర్.. తమ మేనేజర్‌తో కలిసి తనిఖీలు చేశారు. శోభ అనే మహిళ తాగునీటితో వాహనం శుభ్రం చేయడం గుర్తించి వెయ్యి రూపాయల ఫైన్ వేశారు.

# లోక్‌సభలో హిందూ ఆలయాల నిధులపై చర్చ

మొదటిపేజీ తరువాయి

ఆధీనంలో ఉన్న హిందూ ఆలయాల నుంచి వచ్చిన ఆదాయం ఎంత అని నిలదీశారు. ఆలయాల నుంచి వచ్చిన నిధులను ఇతర అవసరాల కోసం ఖర్చు చేశారా అని అడిగారు. ఆలయాలకు స్వతంత్రత కోరుతూ మత సంస్థల నుంచి డిమాండ్లు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించారు. ఈ విషయంపై కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

దేశవ్యాప్తంగా ఆలయాలతో సహా 3,698 చారిత్రక కట్టడాలు, పురాతన నిర్మాణాలను జాతీయ ప్రాముఖ్యత కలిగిన వాటిగా వర్గీకరించామని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ఆర్కియాలాజికల్ సైట్స్ అండ్ రిమెయిన్స్ యాక్ట్ 1958 ప్రకారం వాటిని పరిరక్షిస్తున్నామని చెప్పారు. వాటిలో ఆలయాలతో సహా 143 చారిత్రక ప్రదేశాల్లో టికెట్ల ద్వారా ఆర్కియాలిజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆదాయాన్ని గడిస్తోందని అన్నారు. వాటి ద్వారా 2023-24లో రూ. 317.92 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ నిధులను భారత పురావస్తు శాఖ పురాతన కట్టడాల పరిరక్షణకు తప్ప దారి మళ్లించదని స్పష్టం చేశారు. పరిధిలో ఉన్న ఆలయాలకు స్వతంత్రత కల్పించాలని డిమాండ్ ఏదీ తమ దృష్టికి రాలేదని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు.

# పోసాని కృష్ణమురళికి మరో షాక్

మొదటిపేజీ తరువాయి

ఫ్యామిలీ ఇంటికి కూడా రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో కూలి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నానని.. తనకు ఇప్పుడు చావే శరణ్యమని.. దయ చేసి తనకు రావాల్సిన డబ్బులను పోసాని నుండి ఇప్పించి న్యాయం చేయాలని నేతలు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ లకు అర్జీ ఇచ్చి వాపోయాడు. కాగా, చంద్రబాబుతో పాటు లోకేష్, పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో..ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో పోసానిని అదుపులోకి తీసుకున్నారు రైల్వే కోడూరు పోలీసులు. ఇక అప్పటినుంచి పోసానికి బ్యాడ్‌టైమ్ స్టార్టయింది. రోజుకో కోర్టు..పూటకో పోలీస్ స్టేషన్ అన్నట్టుగా అతడి పరిస్థితి మారిపోయింది. అయితే ఎట్టకేలకు ఆదోని, విజయవాడ, రాజంపేట, నరసరావుపేట కేసుల్లో కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. దీంతో కర్నూలు జైలులో ఉన్న పోసాని విడుదలకు లైన్ క్లియరయింది. అయితే ఇంతలోనే పోసానిపై పీటీ వారెంట్ జారీ చేసింది..సీఐడీ. దీంతో పోసాని విడుదలకు బ్రేక్ పడింది.

# భార్యపై పెట్రోల్ పోసి సజీవదహనం చేసిన భర్త

మొదటిపేజీ తరువాయి

మారుడు (5), కుమార్తె (3) ఉన్నారు. నవీన్ స్థానికంగా ఓ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఎంతో సాఫీగా సాగుతున్న వీరి కాపురంలో కలతలు చెలరేగాయి. భార్య రేఖపై అనుమానం పెంచుకున్న నవీన్ తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడు. దీంతో పెద్దలు కల్పించుకుని ఇద్దరికీ సర్దిచెప్పడంతో కొన్నాళ్లు బాగానే ఉన్నా.. నవీన్‌కు భార్యపై అనుమానం మాత్రం దూరం కాలేదు.ఈ క్రమంలో నవీన్ మళ్లీ వేధించసాగాడు. మార్చి 10వ తేదీ రాత్రి దంపతుల మధ్య మళ్లీ గొడవపడటంతో.. కోపోద్రిక్తుడైన మద్యం మత్తులో భార్య రేఖను అంతమొందించాలని అనుకున్నాడు. అంతే.. తన బైక్‌లో ఉన్న పెట్రోల్ తెచ్చి అమాంతం భార్య రేఖపై పోసి నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కాసేపటి తర్వాత మంటలు ఆర్పివేసిన నవీన్.. అత్తమామాలకు ఫోన్ చేసి.. రేఖ ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపాడు. ఆస్పత్రిలో చేర్పించానని, చికిత్స అందిస్తున్నట్లు నమ్మించే ప్రయత్నం చేశాడు. వెంటనే అక్కడికి పరుగు పరుగున వచ్చిన రేఖ తల్లిదండ్రులు కూతురుని చూసుకుని కుమిలిపోయారు. తీవ్రంగా కాలిపోయిన రేఖ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నవీన్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు

# వాస్తవాలను వినే పరిస్థితిలో వైసీపీ లేదు

మొదటిపేజీ తరువాయి

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విషయంలో వైసీపీ అవాస్తవాలు ప్రచారం చేస్తుండటంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కలుగచేసుకుని వైసీపీ సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టారు. మంత్రి మాట్లాడుతూ.. విద్యారంగంపై శాసనమండలిలో చర్చ జరిగితే వైసీపీ సభ్యులు ఎందుకు బయటకు వెళ్లారు? ఈ విషయాలన్నీ ఆ రోజు చెప్పాం. మీరెందుకు బాయ్ కాట్ చేశారు? ఆ రోజు జరిగిన చర్చలో ఫీజు రీయింబర్స్ మెంట్ పై చాలా స్పష్టంగా చెప్పాం. వినకుండా, చదవకుండా మళ్లీ ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నోట్ పంపిస్తాను.. ఒకసారి చదవాలి. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వాస్తవాలు చెబుతుంటే దానిని కూడా ఓర్చుకోలేక పోతున్నారు. వైసీపీ హయాంలో రూ.4,200 కోట్లు బకాయిలు పెట్టారు. అవునో, కాదో చెప్పాలి. వివరాలు పంపిస్తాం. స్కూల్ ఫీజు రీయింబర్స్ మెంట్, పీజీ ఫీజు రీయింబర్స్ మెంట్ వివరాలన్నీ అందులో ఉన్నాయి. 2019లో ఆనాటి ప్రభుత్వం పెట్టిన బకాయిలను 16 నెలల తర్వాత వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలే అయింది. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం. హౌస్ సాక్షిగా హామీ ఇచ్చాం. చర్చలో వైసీపీ సభ్యులు లేకపోతే నేనేం చేయగలను. బీఏసీలో విద్యారంగంపై చర్చ కావాలని అడిగితే ఒప్పుకున్నాం.

# తిరుమలలో మరోసారి భద్రతా వైఫల్యం

మొదటిపేజీ తరువాయి

హిందూ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనందా, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ శ్రీవారి ఆలయం వద్ద ఆందోళనకు దిగారు.ఆలయానికి సమీపంలోనే దాదాపు 40 మంది ఆందోళనకు దిగిన ఆలయ భద్రతా సిబ్బంది కట్టడి చేయలేక పోయారు. అరగంట పాటు ఆలయం వద్ద నినాదాలతో కార్యకర్తలు ఆందోళన చేశారు. ఆలయం వద్ద ఏదో జరుగుతుందని భక్తులు భయాందోళనకు గురయ్యారు. దాదాపు 30నిమిషాల అనంతరం శ్రీనివాసానందా, రామచంద్ర యాదవ్‌ని అదుపులోకి తీసుకొని తిరుపతికి పోలీసులు తరలించారు. అయితే వరుస ఘటనలతో టీటీడీలో కలవరం మొదలైంది. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని భక్తులు మండిపడుతున్నారు.

# అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ కొరడా

మొదటిపేజీ తరువాయి

ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన వైన్ షాప్‌తో పాటు షెడ్లను నేలమట్టం చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, స్థానికుల ఫిర్యాదుతో అక్రమాలను కూల్చివేశారు. గతంలో పలుమార్లు నోటీసులు ఇచ్చిన వైన్ షాపుల నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారుల కూల్చివేతలపై ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

# బీసీ బిల్లులకు శాసనసభ ఆమోదం

శాతం. వాటిని 42 శాతానికి పెంచుతూ ఆమోదించిన బిల్లు చట్ట రూపం దాల్చాలంటే.. పార్లమెంటులో 2/3 మెజారిటీతో వాటికి ఆమోదం పొందాల్సి ఉంది. ఇందుకు కారణం.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలందరికీ అమలు చేసే రిజర్వేషన్లన్నీ కలిపి 50 శాతాన్ని మించకూడదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఒకవేళ.. రిజర్వేషన్లను పెంచితే వాటిని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చాల్సి ఉంటుంది. అందుకే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 31 (సి) ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతున్నట్టు బిల్లుల్లో పేర్కొంది. న్యాయ సలహా తీసుకుని రాష్ట్రపతి వాటిపై ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అవి చట్టపరంగా నిలబడాలంటే మాత్రం.. బిల్లులను పార్లమెంటు ఉభయ సభలు 2/3 మెజారిటీతో ఆమోదించాలి. అప్పుడు మాత్రమే అవి రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేరి, వాటికి రాజ్యాంగ రక్షణ లభిస్తుంది. అసాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావాలంటే.. అందుకు కారణాలు, అవసరమైన గణాంక సమాచారం ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (4) ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో రిజర్వేషన్లు చేయడం ద్వారా నియామకాలు లేదా పోస్టుల్లో 50% మించవచ్చని తీర్పు ఇచ్చింది. అలాగే, రిజర్వేషన్లను పెంచాలని భావిస్తున్న ఆయా వర్గాలు తమకు తగిన ప్రాతిని?ధ్యం లేదనే వివరాలను సమగ్ర గణాంకాలతో వివరించాలని నిర్దేశించింది. అప్పుడే రిజర్వేషన్ల పెంపునకు పార్లమెంటులో ఆమోదం లభిస్తుంది. అందుకే.. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రత్యేకంగా (డెడికేటెడ్ కమిషన్) ఏర్పాటు చేసింది. నిజానికి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో 2024 నవంబరులో డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే, విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బాధ్యతను కూడా ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఆయన నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌కే అప్పగించింది. ఈ కమిషన్ రిజర్వేషన్లను పెంచడానికి కారణాలను అధ్యయనం చేసిందని బిల్లులో పేర్కొంది. అంతకు ముందు రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేను కమిషన్ సేకరించి క్రోడీకరించిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధ్యయనం చేసి రిజర్వేషన్లు పెంచాలని సూచిస్తూ ఈ ఏడాది మార్చిలో నివేదిక ఇచ్చిందని పేర్కొంది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# అక్రమ అరెస్టులు, నిర్బంధాలు సరికావు



తొలిఅడుగు, జనగామ, మార్చి 17 : అక్రమ అరెస్టులు, నిర్బంధాలు ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వీర్యానికి సంకేతాలు. అక్రమ నిర్బంధాలతో ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచివేయలేరు. శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులను, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. వారం రోజులుగా దీక్షలో ఉన్న వారిని నిర్బంధంలో పెట్టడమేనా ప్రజా పాలన..? ప్రజాస్వామిక విలువల వైపుకు నడవాల్సిన ప్రభుత్వం, అక్రమ నిర్బంధాలతో నియంతృత్వం వైపుకు అడుగులేస్తున్నది. చైతన్యం, పోరాట స్ఫూర్తి కలిగి, నిరంకుశ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన గడ్డ తెలంగాణ, ఆ తెలంగాణలో నియంతృత్వ పోకడలు సాగవు. ప్రజా పాలకులమని చెప్పుకునే నాయకులారా మీరవళంబిస్తున్న ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలను గ్రహించండి.. ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణను చట్టబద్ధత కల్పించండి

# బాణాపురం బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని

## సిపిఎం రిలే నిరాహార దీక్షలు 52వ రోజు స్పందించి అండర్పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి

తొలిఅడుగు, జనగామ, మార్చి 17 : జనగామ పట్టణంలోని హైదరాబాద్ ఎన్హెచ్ బైపాస్ రోడ్డు మీద అండర్పాస్ బ్రిడ్జిని తప్పనిసరి వెంటనే నిర్మించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహ దీక్షలు సోమవారం 52వ రోజు మహిళా సంఘం పట్టణ నాయకురాలు మచ్చ యాదలక్ష్మి దండ వేసి నిరాహార దీక్షలు ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్పందించి అండర్పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని అన్నారు. ప్రభుత్వం మరియు అధికారులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు ఇప్పటికైనా ఎంపీ మరియు అధికారులు స్పందించి అండర్ పాస్ బ్రిడ్జి తక్షణమే ఇవ్వాలి ఈ న్యాయమైన దీక్షలకు జనగామ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అండగా ఉంటుందని అన్నారు. ఇక్కడున్న మహిళలందరినీ ప్రజలను చైతన్యం చేసి జిల్లా వ్యాప్తంగా పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు ఇక్కడ మొత్తం మహిళలు ఉదయం లేచి మున్సిపల్ లో హొటల్లో పని చేసుకుని రాత్రి పూట ఇంటికి కాలునడకన వస్తుంటారు కాబట్టి వారి న్యాయమైన కోరికను అండర్పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇక్కడ ఉండే ప్రజలు దళితులు మైనార్టీలు మహిళలు రోజువారిగా పని చేసుకుంటూ జీవనం కొనసాగే వారు కాబట్టి వారు పనికి వెళ్తూ వస్తూ ఉన్న సమయంలో అనేకమైన ప్రమాదాలకు గురికాకుండా ఉండడం కోసం అండర్పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని వారు అన్నారు లేకపోతే వీరు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ప్రజానాట్యమండలి కళాకారుల సంగం నుండి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం



చుడతామని వారు హెచ్చరించారు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వెంటనే ప్రభుత్వ కలెక్టర్ స్పందించి అండర్పాస్ బ్రిడ్జి నిర్మాణం కొరకు సాంక్షన్ చేయించాలని వారు అన్నారు. ప్రజల పక్షన నిలబడి అండర్ పాస్ బ్రిడ్జిని సాంక్షన్ చేయించాలని అన్నారు. ప్రజా సమస్యలు అండర్పాస్ బ్రిడ్జి నీ నిర్మించాలని వారు అన్నారు . అండర్పాస్ బ్రిడ్జి నిర్మించకపోతే కాలనీ ప్రజలకు గ్రామాల ప్రజలకు తీవ్రమైన నష్టం జరిగేటటువంటి ప్రమాదం ఉంది. ఇట్టి విషయం ఇప్పటికే ఉన్నత అధికారుల దృష్టికి రాజకీయ పార్టీల దృష్టికి తీసుకుపోవడం జరిగింది ఈక్కడ అండర్ పాస్ గురించి నిర్మాణం కోసం అన్ని పార్టీలను కలుపుకొని ఇక్కడ పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తాం ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రజల యొక్క విజ్ఞప్తి గుర్తించుకొని ప్రజల యొక్క బాధలను జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్మాణం చేయాలి ఏదైనా అభివృద్ధి జరిగిందని ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలి తప్ప ప్రజలకు నష్టం చేసే విధంగా అభివృద్ధి కాదు అని అన్నారు ఈ రిలే నిరాహార దీక్ష తోటి ప్రభుత్వాలు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు కు రూపకల్పన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూడిది ప్రశాంత్ దీక్షలు కూర్చున్నవారు బిచ్చల లక్ష్మి బొల్లం సారమ్మ గజ్వేల్లి మానస గాదే లక్ష్మి తాళ్లపల్లి పోషల్ల కర్ణ కంటి పావని ఆదిమూలం విజయ మల్లం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో సంపూర్ణమైన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చి తక్షణమే అమలు చేయాలి

తొలిఅడుగు, జనగామ, మార్చి 17 : ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియమకాలు చేపట్టాలి ఆ దిశగా మార్గదర్శకాలు విడుదల చేయాలి. అసెంబ్లీ చర్చలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలో చేసిన పొరపాట్లను, రిజర్వేషన్ల కేటాయింపులో జరిగిన లోపాలను సరిచేసి అన్ని కులాలకు న్యాయం జరిగేలా చట్టం చేయాలి. ఎనిమిదో రోజు జనగామ జిల్లాలో కొనసాగిన నిరవధిక నిరసన దీక్షలు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ. వివరణ:- ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లుకు చట్టబద్ధత కల్పించనున్న నేపథ్యంలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలో చేసిన పొరపాట్లను, రిజర్వేషన్ల కేటాయింపులో జరిగిన లోపాలను సరిచేసి అన్ని కులాలకు న్యాయం జరిగేలా సంపూర్ణమైన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చి తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



జనగామ జిల్లా కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని అప్పటివరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలను వాయిదా వేయాలని, అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు నేటితో ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల మహేష్ మాదిగ అధ్యక్షత వహించగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై నిండు శాసనసభ సాక్షిగా ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలకు సార్ధకత ఉండాలంటే, ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణలో విడుదల చేస్తున్న వివిధ పరీక్ష ఫలితాలకు కూడా వర్గీకరణ వర్తించేలా మార్గదర్శకాలు విడుదల చేసి ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని అన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ నివేదికపై మొక్కుబడిగా నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రభుత్వము ప్రతిపక్ష, వివిధ రాజకీయ పక్షాలు జనాభా నిష్పత్తులు, రిజర్వేషన్ల కేటాయింపులు చేసిన పొరపాట్లు జరిగిన లోపాలు, ఉద్దేశపూర్వకంగా జరిగిన అన్యాయాలపై చర్చకు తీసుకురావాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ అందరికీ న్యాయం జరిగేలా పకడ్బందీ చట్టానికి కృషి చేయాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగ నియామకాలు చేపట్టడం ద్వారా తీవ్రంగా నష్టపోయామని, మాలల ఒత్తిడికి తలొగ్గి తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం రాజకీయంగా దిగజారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న తప్పుడు విధానాల వలన మాదిగ మాదిగ ఉపకులాలే కాకుండా ఎస్సీల్లోని మెజార్టీ కులాలకు ఉద్యోగాలు రాకుండా అన్యాయమైపోయాయని, గడిచిన ఉద్యోగ పరీక్ష ఫలితాలకు కూడా వర్తించేలా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చి ఆ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలని వారు కోరారు. ప్రభుత్వం చట్టం చేసేంతవరకు అది సంపూర్ణంగా అమలు చేసేంతవరకు మా పోరాటం కొనసాగుతుందని, గౌరవ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో మా నిరసన దీక్షలు ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని, ప్రభుత్వం స్పందించి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని గుర్తు చేశారు.

8వ రోజు దీక్షను టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి లాజర్ మాదిగ, తిప్పారపు ఆనంద్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు గువ్వల రవి మాదిగ, రాష్ట్ర నాయకులు చుంచు రాజు, తళ్లపల్లి కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పాలమాకుల శ్రావణ్ మాదిగ, గుర్రం శ్యామ్ సన్, చెరుపల్లి కుమార్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షులు దండు ఉమేష్ మాదిగ, అంతగల్ల మధు మాదిగ, నర్సింగరావు మాదిగ, కరుణాకర్ మాదిగ, అల్వల రాజు మాదిగ, వెంగలి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రైతన్నలకు కష్టాలు తెచ్చింది

## - సాగునీటిని విడుదల చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

తొలి అడుగు, చిన్నకోదూర్, మార్చి 16 : మండల కేంద్రంలో ని సాగునీటి విడుదల చేసిన మాజీ మంత్రి , ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీతోనే రైతన్నలకు నిండుకుండలాగా చెరువులు కుంటలు నింపడం జరిగిందని అన్నారు. రైతన్నలకు ఎలాంటి బాధలు లేకుండా కేవలం బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే కంటికి రెప్పలా కాపాడుకున్నది అని కొనియాడారు. ఈ




కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏలేటి రాధాకృష్ణ శర్మ,మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, వైస్ మాజీ ఎంపీపీ పాపయ్య,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కామని శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దగ్ధం

తొలిఅడుగు, చిన్నకోదూరు, మార్చి 16 : టీ పి సి సి పిలుపు మేరకు సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకుఈ రోజు చిన్నకోడూర్ మండల కేంద్రంలో దళిత బిడ్డ తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గౌరవ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారి పైన అనుచిత వాక్యాలు మాట్లాడిన బీఆర్ఎస్ పార్టీ %మీూా% గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ సభ్యత్వం శాశ్వతంగా రద్దు చేయాలని మండల కంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చెయ్యటం జరిగింది, దళితుణ్ణి ముఖ్యమంత్రి చేస్తానని మాట ఇచ్చి 10 సవంత్సరాలు అధికారంలో ఉండి ఏ ఒక్క దళిత బిడ్డకు న్యాయం చెయ్యని ఘనత మీ %దీ=వా% పార్టీ కి దక్కుతుంది, పదవి పోయి సహనం కోల్పోయిన %ఎతీం% నాయకులు ఒక్క దళిత స్పీకర్ కూర్చుకి విల్వ ఇవ్వని నీచమైన సంస్కృతి మీది, ప్రజా ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు పూర్తి కావొస్తోంది, ఇప్పటి అసెంబ్లీ కి వస్తే ఎక్కడ



దళిత స్పీకర్ ముందు ఎక్కడ అధ్యక్ష అనవాల్సి వస్తుందని రాలేక ఇలాంటి అనుచిత వాక్యాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు బంక చిరంజీవి యాదవ్,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ జర్నల్ సెక్రెటరీ అజ్జు యాదవ్,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వాసరి అజయ్, సేవాదళ్ మండల అధ్యక్షులుఅరకల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ వర్కర్స్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆంకర్ మధు,ఎన్ ఎస్ యు ఐ జనరల్ సెక్రెటరీ గుంజే రాజేందర్, సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మిట్టపల్లి మహేష్,సీనియర్ నాయకులు కూన శ్రీనివాస్, సంతోష్ ,శ్రీశైలం, రామంచ ఎల్లయ్య, ఎండి బాబుమియ్య తదితరులు పాల్గొన్నారు.

## ముజఫర్ నగర్ హంద్రీ నది వెంట

# మురికి కాలువ నిర్మించి, సిసి రోడ్డు వేయాలి

తొలిఅడుగు, కల్లూరు : ప్రజా చైతన్య యాత్ర సోమవారం 32 వ వార్డు ముజఫర్ నగర్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకుని రావడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయి బాబా ,కె సుధాకరప్ప, ఏరియా కార్యదర్శి ఎం సి ఆనందులు మాట్లాడుతూ హంద్రీ నదిలో విపరీతంగా కంపచెట్లు పెరిగి అడవిలో మారిపోయిందని అందులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అంతేకాకుండా ముజఫర్ నగర్ కాలనీ లోని మురికినిరంతా హంద్రీ నదిలో కలవడం వల్ల అక్కడ బురద ఏర్పడి పందులు దోమలు, క్రిమి కీటకాదులు మొత్తం కాలనీలోకి ప్రవేశిస్తున్నాయని దానివల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వారు తెలిపారు హంద్రీ నదిలో ముళ్లపొదలు ఉండడంవల్ల రాత్రిపూట విష సర్పాలు కాలనీలోకి ప్రవేశిస్తున్నాయని అందువల్ల అందువల్ల ఇక్కడ ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని వారు తెలిపారు వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని ముజఫర్ నగర్ ఐఎంఎల్ డిపో నుండి కల్లూరు హంద్రీ బ్రిడ్జి వరకు హంద్రీ నది వెంట మురికి కాలువ నిర్మించి సిసి రోడ్డు వేయాలని వారు డిమాండ్ చేశారు అలాగే ముజఫర్ నగర్ లో కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న సచివాలయాలు ఖాళీ చేసి పెళ్లిళ్లకు ఫంక్షన్లకు ఉపయోగపడేలాగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఇక్కడ ఉన్న వారంతా కూడా పేద ప్రజలు బయటకు వెళ్లి పెళ్లిళ్లు చేసుకోవాలంటే ఫంక్షన్ హాల్ లకు లక్షల రూపాయలు ఖర్చులు పెట్టే స్తోమత ఇక్కడ ప్రజలకు లేదని వారు తెలిపారు వెంటనే ముజఫర్ నగర్ పార్కులో సచివాలయాలు నిర్మించి కమ్యూనిటీ హాల్ లో నిర్వహిస్తున్న సచివాలయం ఖాళీ చేయాలని కమిషనర్ గారికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగిరెడ్డి వెంకటేశ్వర్లు రాజు రమణమ్మ రాణి సీతాలక్ష్మి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

## కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేయాలి అని తాసిల్దార్ కి వినతి



తొలిఅడుగు, డోన్ : ప్రపంచ వినియోగదారుల వారోత్సవాలలో భాగంగా డోన్ మండల తాసిల్దార్ నాగమణి కి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందుడోన్ తాలూకా నందు వాతావరణ కాలుష్య నివారణ అధికారులు గత పది సంవత్సరముల నుండి డోన్ ప్రాంతమునకుపర్యవేక్షణ లేనందువలన కాలం చెల్లిన వాహనాల వల్ల వాతావరణ కాలుష్యము చెడిపోయి వినియోగదారులు ప్రజలు శ్వాస కోస వ్యాధులతో అనారోగ్యానికి గురయ్యారు కాలంచెల్లిన వాహనాల వల్ల వాతావరణమంతాకాలుష్యం అయిపోయి శ్వాస కోసం వ్యాధులు ఇతర వ్యాధులతో చాలామంది అనారోగ్యానికి గురయ్యారని పర్యావరణ పరిరక్షణ అధికారులు ఎన్నో సంవత్సరాల నుండి డోన్ ప్రాంతమునకు రాకపోవడం వలన కాలం చెల్లిన వాహనాల వల్ల వాతావరణంపర్యావరణం దెబ్బతినిందని వెంటనే తాసిల్దార్ జిల్లా కలెక్టర్ కి మా ఫిర్యాదును పంపించి కాలుష్య నివారణ అధికారులను డోన్ పట్టణం నందు పర్యవేంచే విధంగా సహాయపడతారని తెలియజేశారు ఈ కార్యక్రమం డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు ఏఈ నాగరాజు సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ సంఘసంస్కర్త పూలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## యెమెన్‌లో అమెరికా దాడులు



తొలిఅడుగు, డెస్క్ : యెమెన్‌లో అమెరికా జరిపిన దాడుల్లో 24 మంది మరణించారు. ఆ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, 'హౌతీల సమయం అయిపోయింది' అని స్పష్టం చేశారు. ఆయన ఈ సందర్భంగా ఇరాన్‌ను కూడా హెచ్చరించారు. హౌతీలకు మద్దతు తక్షణం ఆపాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక జారీ చేశారు. 'హౌతీ ఉగ్రవాదులు అందరికీ హెచ్చరిక. వారి సమయం ముగిసింది. ఇప్పటి నుంచి మీ దాడులకు ఫుల్‌స్టాప్ పెట్టవలసిందే. కాదంటే గతంలో ఎన్నడూ చూడనంతగా నరకం చూస్తారు' అని ట్రంప్ సోషల్ మీడియాచ పోస్ట్‌లో హెచ్చరిక జారీ చేశారు. హౌతీలు బలంగా ఉన్న యెమెన్ రాజధాని సానాలో అమెరికా జరిపిన దాడుల్లో 13 మంది పౌరులు, మరి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో నలుగురు చిన్నారులు, ఒక మహిళ ఉన్నారు. ఇది ఇలా ఉండగా, యెమెన్‌పై అమెరికా జరిపిన దాడుల్లో మహిళలు, పిల్లలతో సహా మృతుల సంఖ్య 31కి పెరిగినట్లు హౌతీ రెబెల్స్ అధీనంలోని ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. శనివారం రాత్రి దాడుల్లో మరి 101 మంది గాయపడినట్లు మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అనీస్ అల్ అస్బాహి తెలిపారు. ఆమెరికా బాంబు దాడులతో సానా చుట్టుపక్కల ప్రాంతాలో భూమి కంపించింది. దీనితో అందరూ భూకంపం వచ్చిందని భ్రమపడ్డారు. ట్రంప్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నారని హౌతీ పొలిటికల్ బ్యూరో ఆరోపించింది. ఆ దాడులకుసమాధానం చెప్పేందుకు యెమెన్ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని బ్యూరో హెచ్చరించింది. గత దశాబ్దంలో యెమెన్‌లోని ఎక్కువ భూభాగాన్ని హైతీలు తమ అధీనంలోకి తీసుకున్నారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం ప్రారంభమైన తరువాత దాని తీరంలోని ఓడలపై హౌతీలు దాడులు ప్రారంభించారు. ఇది ప్రపంచ వాణిజ్యానికి ఆటంకంగా మారింది. గాజాలో యుద్ధంపై పాలస్తీనియన్లకు సంఘీభావంగా ఈ దాడులు జరుపుతున్నట్లు హౌతీలు చెబుతున్నారు. కాగా, 2023 నుంచి హౌతీలు 174 పర్యాయాలు అమెరికా యుద్ధ నౌకలపై, 145 సార్లు వాణిజ్య నౌకలపై దాడి చేసినట్లు సమాచారం.

# అమెరికాలో ప్రకృతి విపత్తుల బీభత్సం



తొలిఅడుగు, డెస్క్ : మధ్య, దక్షిణ అమెరికా వ్యాప్తంగా టోర్నడోలు, పెను గాలులు సృష్టించిన బీభత్సంలో ఇళ్లు ధ్వంసమయ్యాయి, పాఠశాలలు తుడిచిపెట్టుకునోయాయి,సెమీట్రాక్టర్ ట్రెయిలర్లు పల్టీకొట్టాయి. పెను తుపానుకు కనీసం 32 మంది బలి అయ్యారు. తుపాను వల్ల బాగా దెబ్బ తిన్న వేయిన్ కౌంటీలో తన బంధువు ఇంటి వద్ద శిథిలాల్లో శుక్రవారం రాత్రి చెల్లాచెదురుగా పడి ఉన్న ఐదు శవాలను తాను, ఇతర సహాయక సిబ్బంది కనుగొన్నామని మిస్సౌరి వాసి డకోటా హెండర్సన్ తెలిపార. రాష్ట్రంలో శిథిల భవనాల్లో కనీసం డజను మంది మరణించారని అధికారులు తెలిపారు. కాగా, మూడు కౌంటీల్లో ఆరుగురు వ్యక్తులు మృతి చెందినట్లు, తుపానులు తూర్పు దిశగా అలబామా వైపు కదలగా మరి ముగ్గురు శనివారం రాత్రి పొద్దుపోయిన తరువాత గల్లంతయ్యారని మిస్సిసిపి గవర్నర్ టేట్ రీవ్స్ వెల్లడించారు. అలబామాలో ఇళ్లు. రోడ్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. ఆర్కన్సాస్‌లో ముగ్గురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఆర్కన్సాస్ గవర్నర్ సారాహ్ హుక్కబీ సాండర్స్, జార్జియా గవర్నన్ బ్రియాన్ కెంప్ తమ తమ ప్రాంతాల్లో ఎమర్జన్సీ ప్రకటించారు. జార్జియాలో ఇసుక తుపాను ఉద్ధృతికి శు క్రవారం కనీసం 12 మంది మరణించారు. కాన్సాస్ హైవేపై కనీసం 50 వాహనాలు ఒకదానినొకటి ఢీకొని కుప్పలుగా పేరుకుపోగా ఎనిమిది మంది వ్యక్తులు మృతి చెందారు. టెక్సస్‌లోని అమరిల్లోలో ఇసుక తుపాను ధాటికి కార్లు ప్రమాదానికి గురి కాగా ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉండగా, ఓక్లహామా రాష్ట్రంలో 130 పైచిలుకు కార్చిచ్చులు రేగగా కొన్ని కమ్యూనిటీల్లో జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అక్కడ సుమారు 300 ఇళ్లు దెబ్బ తినడమో, ధ్వంసం కావడమో జరిగింది. సుమారు 689 చదరపు కిలోమీటర్ల ప్రాంతం దగ్ధమైందని, ఓక్లహామా నగరం ఈశాన్య ప్రాంతంలో తన సొంత ఇంటిని నష్టపోయానని గవర్నర్ కెవిన్ స్టిట్ మీడియా గోష్ఠిలో వెల్లడించారు.

# 88 కోట్లు విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం



తొలిఅడుగు, న్యూఢిల్లీ: రూ. 88 కోట్లు విలువ చేసే మెథామ్‌ఫెటామైన్ టాబ్లెట్ల భారీ సరకును స్వాధీనం చేసుకున్నట్లు, ఇంఫాల్, గౌహతి మండలాల్లో అంతర్జాతీయ డ్రగ్ ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేసినట్లు కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం వెల్లడించారు. భారీ స్థాయిలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం దర్యాప్తు దిశగా సంపూర్ణ దృక్పథానికి ప్రబల నిదర్శనం అని కూడా అమిత్ షా అన్నారు. డ్రగ్స్‌పై నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూనే ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 'డ్రగ్స్ మాఫియాపై దయాదాక్షిణ్యాలు ఏమీ ఉండవు. డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం దిశగా మోడీ ప్రభుత్వ ప్రస్థానాన్ని వేగవంతం చేస్తూ రూ. 88 కోట్లు విలువ చేసే మెథామ్‌ఫెటామైన్ ట్యాబ్లెట్ల భారీ సరకును స్వాధీనం చేసుకున్నారు. ఇంఫాల్, గౌహతి జోన్‌లలో అంతర్జాతీయ డ్రగ్ ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేశారు' అని అమిత్ షా 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. ఈ విజయానికి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి)కి హెూమ్ శాఖ మంత్రి 'హృదయపూర్వక' అభినందనలు తెలియజేశారు. ఒక సమాచారం ఆధారంగా ఎన్‌సిబి ఇంఫాల్ జోన్ అధికారులు ఈ నెల 13న ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారని, ఎన్‌సిబి బృందం లైలాంగ్ ప్రాంతంలో ఒక ట్రక్‌ను అడ్డుకుని, ట్రక్ వెనుక భాగంలో ఒక టూల్‌బాక్స్‌లో నుంచి 102.39 కిలోల మెథామ్‌ఫెటామైన్ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారని ఒక అధికార ప్రకటన వెల్లడించింది. ట్రక్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసినట్లు ఆ ప్రకటన తెలియజేసింది. ఆ బృందం ఏమాత్రం ఆలస్యంచేయకుండా తదుపరి ఆపరేషన్ నిర్వహించి, లైలాంగ్ ప్రాంతంలో ఆ నిషిద్ధ డ్రగ్స్ అందుకున్నట్లుగా అనుమానిస్తున్న వ్యక్తిని పట్టుకున్నదని ఆ ప్రకటన తెలిపింది. డ్రగ్స్ అక్రమరవాణాకు ఉపయోగించిన ఒక నాలుగు చక్రాల వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు, ఆ తరువాత సదరు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రకటన తెలియజేసింది. ఆ నిషిద్ధ డ్రగ్స్‌కు అనుమానిత మూలస్థానం మణిపూర్‌లోని మోరెహ్ పట్టణం అని, ఈ కేసులో పాత్ర ఉన్న ఇతరుల పట్టివేతకు మరింత దర్యాప్తు సాగుతోందని ప్రకటన తెలియజేసింది.

## 67 సంస్థలపై నిషేధం

# విధించిన ఎంహెచ్ఎ

తొలిఅడుగు, న్యూఢిల్లీ: కేంద్ర హెూం శాఖ (ఎంహెచ్ఎ) తాజాగా 67 సంస్థలపై నిషేధం విధించింది. ఉగ్రవాద సంస్థలు, చట్టవ్యతిరేక సంస్థల సవరించిన తాజా జాబితాను ఎంహెచ్ఎ గురువారం ప్రకటించింది. ఉగ్రవాద కార్యకలాపాలలో వారి పాత్ర కారణంగా, దేశ భద్రతకు ముప్పు కలిగిస్తున్నందుకు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యుఎపిఎ) కింద 67 సంస్థలపై నిషేధం విధించినట్లు తెలిపింది. యుఎపిఎ సెక్షన్ 35 కింద అధికారికంగా ఉగ్రవాదసంస్థలుగా వర్గీకరించి, చట్టంలోని మొదటి షెడ్యూల్‌లో 45 సంస్థలను చేర్చినట్లు పేర్కొంది. మిగిలిన 22 సంస్థలను యుఎపిఎ సెక్షన్ 3(1) కింద చట్ట వ్యతిరేక సంస్థలుగా వర్గీకరించింది. ఈ సంస్థలలో చాలావరకు దేశవ్యాప్తంగా ఉగ్రవాదం, వేర్పాటువాదం మరియు హింసాత్మక కార్యకలాపాలలో పాల్గన్నాయని ఎంహెచ్ఎ పేర్కొంది. ప్రతి ఏడాది ఎంహెచ్ఎ ఈ జాబితాను ఆధునీకరిస్తూనే ఉంది. యుఎపిఎ కింద జాబితా చేసిన సంస్థల ఆస్తులను స్తంభింపచేయడం, చటటవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గన్న సభ్యుల అరెస్టులు వంటి చర్యలను చేపడుతోంది.

# సంగీత దర్శకుడు రెహమాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ

తొలిఅడుగు,న్యూఢిల్లీ: ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్(58) ఆదివారం డీహైడ్రేషన్ కారణంగా ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. ఆయనను చికిత్స అనంతరం కొన్ని గంటల తరువాత డిశ్చార్జ్ చేశారు. 'ఇప్పుడాయన ఇంటికొచ్చారు' అని ఆయన మేనేజర్ సెంథిల్ వేలన్ తెలిపారు. రెహమాన్ సోదరి రిహానా 'ఆయనకు ఏమి కాలేదు. ఆయన డీహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్యలతో అనారోగ్యంగా ఉన్నారు, అంతే.' అని పిటిఐ వీడియోకు తెలిపింది. కాగా ఆయనకు మెడ నొప్పి కూడా ఉందని మేనేజర్ తెలిపాడు. రెహమాన్‌కు దూరంగా ఉంటున్న ఆయన భార్య సైరా కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పైగా ఆమె తనను రెహమాన్ మాజీ భార్య అని పేర్కొనొద్దని, తాము విడాకులు ఇంకా తీసుకోలేదని, విడిపోలేదని ఓ ఆడియో స్టేట్‌మెంట్‌లో తెలిపారు. ఇదిలావుండగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ తాను హాస్పిటల్ డాక్టర్లతో మాట్లాడానని, రెహమాన్ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నానని అన్నారు. రెహమాన్ బాగానే ఉన్నారని, త్వరగా కోలుకుని ఇంటికి వస్తారని ఓ సోషల్ మీడియా పోస్ట్‌ను కూడా స్టాలిన్ పెట్టారు.

# సంపాదకీయం

నిజాం వ్యతిరేక పోరాట యోధుడు

మందుముల నరసింగరావు (మార్చి 17, 1896 – మార్చి 12, 1976) నిజాం విమోచన పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు, పత్రికా రచయిత, న్యాయవాది, ఆంధ్ర జనసంఘ స్థాపకులు, సంఘ సంస్కర్త, పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు మార్చి 17, 1896 న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నరసింగరావు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినారు. పర్షియన్ భాషలో కూడా ఆయన గొప్ప పండితులు, పత్రికా రచయితగా పేరు పొందారు. 1921లో ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించిన వారిలో ఒకడు. 1927లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకియాలు చేపట్టారు. 1927లో రయ్యత్ అనే ఉర్దూ వార్తాపత్రిక స్థాపించి సంపాదక బాధ్యతలు చేపట్టారు. మందుముల, సమర రంగంలో కూడా కీలకపాత్ర వహించి 1937లో ఇందూరు (నిజామాబాదు) లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. 1938–42 కాలంలో నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. 1947లో జాయిన్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషి చేశారు. 1952లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పని చేశారు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించారు. టేకుమాల రంగారావు, మాడపాటి హనుమంత రావు, మిట్ట లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకి రామయ్య, బూర్గుల రామకృష్ణా రావు, బోయినపల్లి వెంకట రామారావు, కొమ్మవరపు సుబ్బారావు బూర్గుల నరసింహా రావు, డాక్టర్ పందింటి రామస్వామి నాయుడు తదితరులతో కలిసి 'ఆంధ్ర జనసంఘం'ను స్థాపించారు. హైదరాబాద్ సంస్థాన ఆధునిక చరిత్రలో రావి నారాయణరెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ వంటివారు అతివాద వర్గం ప్రతినిధులు కాగా, బూర్గుల రామ కృష్ణారావు, మందుముల నరసింగ రావు, మాడపాటి హనుమంత రావు, మాదిరాజు రామకోటీశ్వర రావుతదితరులు మితవాదులు. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహా సభలకు వివిధ గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై వచ్చిన వారు...రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణారావు లాంటి ప్రముఖులను ఎడ్ల బండ్ల మీద ఊరేగించారు. ఆయన బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషిచేశారు. 1952లో కల్వకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పనిచేశాడు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించాడు. యాభై ఏళ్ల హైదరాబాదు నగర సమగ్రచరిత్ర ఈ గ్రంథం. హైదరాబాదు రాజకీయ సామాజిక జీవనంలో ప్రధానపాత్ర పోషించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మందుముల నరసింగరావు కలం నుండి వెలువడిన రచన. ప్రత్యక్ష సాక్షిగా ఆయన కథనం. మందుముల నరసింగరావు కూతురు అనంతలక్ష్మిని బూర్గుల రామకృష్ణారావు రెండో వివాహం చేసుకున్నారు. సమర యోధుడిగా పేరుపొందిన మందుముల రామచంద్రారావు ఆయన సోదరుడు. మార్చి 12, 1976 న మందుముల మరణించారు.

# దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ప్రారంభం



తొలిఅడుగు, : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అమెరికా టారిఫ్‌ల ప్రకటనలు, ఆ దేశంలో నిరుద్యోగిత పెరగడం లాంటి పరిణామాలతో మదుపర్లు అప్రమత్తతను కొనసాగిస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 230 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 23,350 దిగువన ట్రేడింగ్ మొదలుపెట్టింది. ఉదయం 9 :30 గంటల సమయంలో సెన్సెక్స్ 388 పాయింట్లు నష్టంతో 73,726వద్ద.. నిఫ్టీ 113 పాయింట్లు కుంగి 22,346 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, జమాటో, ఎంఅండ్ఎం, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, బజాజ్‌ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ, నెస్లే ఇండియా, ఐటీసీ, హెచ్‌యూఎల్ షేర్లు మాత్రమే లాభాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 70 డాలర్ల దిగువన ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,899.60 డాలర్ల వద్ద కదలాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 87.38 వద్ద కొనసాగుతోంది. అమెరికా మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎస్అండ్‌పీ సూచీ 2.69 శాతం, డోజోన్స్ 2.08 శాతం కుంగగా.. నాస్‌డాక్ ఏకంగా 4 శాతం నష్టపోయింది. ఆసియా–పసిఫిక్ మార్కెట్లు నేడు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 0.78 శాతం, జపాన్ నిక్కీ 1.74 శాతం నష్టంతో కదలాడుతుండగా.. షాంఘై, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ ఫ్లాట్‌గా ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.485 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.264 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు నేడు ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 10 శాతం నష్టపోయాయి. బ్యాంక్‌కు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో షేర్లు పతనమయ్యాయి. దీనికితోడు ప్రస్తుత సీఈఓ సుమంత్ కత్పలియా పదవీకాలాన్ని మూడేళ్లు కాకుండా, ఒక సంవత్సరం పాటే పొడిగించేందుకు ఆర్‌బీఐ అనుమతించింది. ఈ నిర్ణయం కూడా షేర్లపై ప్రభావం చూపింది

# భారత్‌లో ఏఐ నిపుణులకు భారీ కొరత




తొలిఅడుగు, : ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల హబ్‌గా ఎదిగేందుకు భారత్ సిద్ధంగా ఉందని బెయిన్ అండ్ కంపెనీ తాజా నివేదిక పేర్కొంది. కానీ, దేశంలో ఏఐ నిపుణుల కొరత పెరుగుతోందని, ఈ రంగంలో భారత పురోగతికి ఇది అవరోధంగా మారవచ్చని అభిప్రాయపడింది. 2027 నాటికి భారత ఏఐ రంగం 10 లక్షలకు పైగా నిపుణుల కొరతను ఎదుర్కొనవచ్చని అంచనా వేసింది. ఏఐ నిపుణులకు గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ తన కార్మిక శక్తికి ఈ నైపుణ్యంలో శిక్షణ అందించాల్సిన తక్షణావసరాన్ని బెయిన్ అండ్ కంపెనీ నివేదిక నొక్కి చెప్పింది. మరో రెండేళ్లలో ఏఐ ఉద్యోగావకాశాలు నిపుణుల లభ్యతతో పోలిస్తే 1.5–2 రెట్ల స్థాయిలో ఉండవచ్చని అంటోంది. ఇది సవాలుతో పాటు అవకాశం కూడా. ప్రస్తుత సాంకేతిక నిపుణులకు ఏఐలో శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ లోటును భర్తీ చేసుకోవచ్చని బెయిన్ అండ్ కంపెనీ భారత పార్ట్‌నర్ సైకత్ బెనర్జీ అన్నారు. 2027 నాటికి భారత ఏఐ రంగంలో ఉద్యోగావకాశాలు 23 లక్షలు దాటవచ్చని.. అప్పటికి ఏఐ నిపుణుల లభ్యత మాత్రం 12 లక్షలకు పెరగవచ్చని, ఈ నేపథ్యంలో మరో 10 లక్షల మందికి ఈ ఆధునిక సాంకేతికతలో శిక్షణ ఇప్పించవచ్చని నివేదిక పేర్కొంది. 2019 నుంచే ఏఐ ఉద్యోగావకాశాలు వెల్లువెత్తాయి. ఏటా 21 శాతం పెరుగుతూ వచ్చాయని, ఈ రంగంలో నిపుణులకు పారితోషికం ఏటా 11 శాతం పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ, ఈ రంగంలో నిపుణుల లభ్యత మాత్రం అంతగా పెరగలేదు.

# మార్కెట్లకు ఆఖర్లో నష్టాలు సెన్సెక్స్ 217 పాయింట్ల పతనం



తొలిఅడుగు, : దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటాయి. సెన్సెక్స్ 74,475 పాయింట్ల వద్ద ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 407 పాయింట్లు పెరిగి 74,741 గరిష్ఠానికి చేరింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి చోటు చేసుకోవడంతో 217 పాయింట్లు కోల్పోయి 74,115కు పడిపోయింది. ఓ దశలో 74,022 కనిష్ఠాన్ని చవి చూసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 92 పాయింట్లు తగ్గి 22,460 వద్ద ముగిసింది. ఇండుస్ఇండ్ బ్యాంక్, జొమాటో, లర్సన్ అండ్ టర్బో, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు పవర్ గ్రిడ్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, ఐటిసి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఎంసిజి మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పిఎస్‌యు బ్యాంక్ సూచీలు రెండు శాతం వరకు నష్టపోయాయి. మార్చిలో ఇప్పటి వరకు రూ.15,502 కోట్ల విలువ చేసే ఈక్విటీలను విదేశీ సంస్థాగత మదుపర్లు తరలించుకుపోయారు.

## రోజూ పెరుగు తింటున్నారా..!



**తొలిఅడుగు, ఆరోగ్యం :** పెరుగు...దాదాపు అందరూ ఇష్టంగా తింటూ ఉంటారు. ఇక వేసవిలో అయితే, పెరుగు డిమాండ్ ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం చాలా మంది పెరుగు, మజ్జిగను తీసుకుంటారు. అయితే, ఇలా ఏదో ఒక రూపంలో రోజూ పెరుగు తీసుకుంటే శరీరంలో ఎలాంటి మార్పులు కలుగుతాయో పోషకాహార నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం. పెరుగు తినడం వల్ల పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెరుగులో ప్రోటీన్స్, కాల్షియం, విటమిన్లు, మినరల్స్ ఇలా శరీరానికి అవసరమైన పోషకాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ కూడా ఎముకలకి చాలా మంచిది. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. ఇది అసిడిటీ, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. రోజూ పెరుగు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పెరుగులోని కాల్షియం, విటమిన్లు, కేలరీలు, ప్రోటీన్ శరీరానికి సరైన పోషణను అందిస్తాయి. పెరుగు కాల్షియం, విటమిన్లు దీ2, దీ12, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది. పెరుగును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. పెరుగులో కొవ్వు తక్కువగా ఉంటుంది. గుడ్ కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇందులోని కొవ్వు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. రోజూ పెరుగు తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు తగ్గుతుంది. పెరుగులోని ప్రోటీన్స్ అతిగా తినడాన్ని తగ్గిస్తుంది. కాబట్టి బరువు కూడా తగ్గుతారు. ఇక ఇందులోని కాల్షియం తలనొప్పి తగ్గిస్తాయి. అంతేకాదు..పెరుగు తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పెరుగు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పెరుగు చుండ్రుతో సహా అనేక జుట్టు సమస్యలను తగ్గిస్తుంది.

## ఎండల్లో చల్లగా చెరకు రసం తాగుతున్నారా?



**తొలిఅడుగు, ఆరోగ్యం :** సాధారణంగా మండే ఎండల్లో చల్లని పానీయాలు తాగాలని అనిపిస్తుంది. చాలా మంది చెరకు రసం తాగేందుకు ఇష్టపడతారు. చెరకు రసం తాగిన తర్వాత మజాగా అనిపిస్తుంది. కానీ ఇలా తరచూ చెరకు రసం తాగడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. చెరకు రసం శరీరానికి అంత ఆరోగ్యకరమైనది కాదని ×జవీ= కూడా చెబుతోంది. శీతాకాలం ముగిసిపోయింది. ప్రకృతిలో వేసవి వేడి క్రమంగా పెరుగుతుంది. ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ దాహం పెరుగుతుంది. ఇలాంటి సమయంలో చల్లని పానీయం తాగాలని అనిపిస్తుంది. చాలా మంది చెరకు రసం తాగేందుకు ఇష్టపడతారు. చెరకు రసం తాగిన తర్వాత మజాగా అనిపిస్తుంది. కానీ ఇలా తరచూ చెరకు రసం తాగడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. చెరకు రసం శరీరానికి అంత ఆరోగ్యకరమైనది కాదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ కూడా చెబుతోంది.100 మి.లీ చెరకు రసంలో దాదాపు 13-15 గ్రాముల చక్కెర ఉంటుందని పరిశోధనలో తేలింది. పెద్దలు రోజుకు 30 గ్రాముల కంటే ఎక్కువ చక్కెరను, 7-10 సంవత్సరాల వయస్సు గల టీనేజర్లు 24 గ్రాముల కంటే ఎక్కువ చక్కెరను తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. అయితే, మండే ఎండల్లో చెరకు రసం తాగకూడదని మాత్రం ×వీజ= చెప్పడం లేదు. ఏదీ అతిగా తీసుకోవడం మంచిది కాదు. చెరకు రసం తాగడం వల్ల కొంత నష్టం ఉన్నప్పటికీ, దానిని తాగడం వల్ల కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. చెరకు రసంలో పోషక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్, ఐరన్, పొటాషియం, భాస్వరం, కాల్షియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వేసవిలో చెరకు రసం తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అదనంగా, చెరకు రసంలోని ఖనిజాలు దంతాలు, ఎముకలను బలపరుస్తాయి.

## భోజనం తర్వాత బెల్లం, నెయ్యి తిని చూడండి..!



**తొలిఅడుగు, ఆరోగ్యం :** ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. సాధారణంగా జీర్ణం కావడానికి భోజనం తర్వాత చాలా మంది సోంపు తింటారు. కానీ భోజనం తర్వాత నెయ్యి, బెల్లం తినడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీని గురించి చాలా తక్కువ మందికి తెలుసు. మన ఆహారం ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపుతుంది. ఆహారం మాత్రమే కాదు, తిన్న తర్వాత మనం తీసుకునే ఆహారం కూడా మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అందుకే భోజనం తర్వాత కూడా కొందరు కొన్ని ప్రత్యేక పదార్థాలను తింటుంటారు. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. సాధారణంగా జీర్ణం కావడానికి భోజనం తర్వాత చాలా మంది సోంపు తింటారు. కానీ భోజనం తర్వాత నెయ్యి, బెల్లం తినడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీని గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ప్రతిరోజూ భోజనం తర్వాత నెయ్యి, బెల్లం తినడం మీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది తిన్న తర్వాత ఉబ్బరం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. తిన్న ఆహారం తేలికగా, సౌకర్యవంతంగా అనిపిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మీకు తక్షణ శక్తి లభిస్తుంది. నెయ్యి ఒక ఆరోగ్యకరమైన కొవ్వు, ఇది భోజనం తర్వాత బద్ధకాన్ని నివారిస్తుంది. నెయ్యి, బెల్లం శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడతాయి. భోజనం తర్వాత క్రమం తప్పకుండా నెయ్యి, బెల్లం తీసుకోవడం వల్ల శరీరం లోపలి నుండి శుభ్రపడుతుంది. శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి ఇది మంచి ఎంపిక. నెయ్యి, బెల్లం రెండూ వాటి యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. భోజనం తర్వాత నెయ్యి, బెల్లం తినడం వల్ల కీళ్ల నొప్పులు, కండరాల దృఢత్వం తగ్గుతుంది.

# కీరదోస వేళాపాళా లేకుండా తినేస్తున్నారా?




**తొలిఅడుగు, ఆరోగ్యం :** వేసవి తాపం నుంచి బయటపడటానికి చాలా మంది చల్లని పానియాలు, కీరదోస వంటి చల్లని ఆహారాలు తీసుకుంటూ ఉంటారు. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా, వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. బరువు తగ్గడం నుంచి జీర్ణక్రియను మెరుగుపరచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటం వరకు ప్రయోజనకరంగా ఉంటాయి. వేసవిలో కీరదోస ఆహారంలో భాగంగా చాలా మంది తీసుకుంటూ ఉంటారు. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా, పోషకాలతో నిండి ఉంటుంది. బరువు తగ్గడం నుంచి జీర్ణక్రియను మెరుగుపరచడం, మంచి చర్మాన్ని నిర్వహించడం వరకు దేనికైనా కీరదోస ప్రయోజనకరంగా ఉంటాయి. కీరదోస తినడం వల్ల తాజాగా అనిపిస్తుంది. అయితే చాలా మంది రోజులో ఏ సమయంలోనైనా కీరదోస తినొచ్చని అనుకుంటారు. అయితే, చాలా మందికి కీరదోస తినడానికి కూడా ఖచ్చితమైన సమయం ఉంటుందనే విషయం తెలియదు. కీరదోస ఎప్పుడు తినడం చాలా ప్రయోజనకరమో ఇక్కడ తెలుసుకుందాం..

కీరదోస డీటాక్స్ గా ఉపయోగించాలనుకుంటే, మీరు ఉదయం ఖాళీ కడుపుతో తినవచ్చు. ఇది కడుపును శుభ్రపరచడంలో సహాయపడుతుంది. శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి సహాయపడుతుంది. అలాగే, ఇందులో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. నీటి పరిమాణం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది జీర్ణక్రియను పెంచడానికి సహాయపడుతుంది. కానీ ఖాళీ కడుపుతో ఎక్కువగా కీరదోస తినడం వల్ల కొంతమందిలో గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి. మీకు అసిడిటీ సమస్యలు ఉంటే ఉదయం ఖాళీ కడుపుతో దోసకాయ తినకపోవడమే మంచిది. మధ్యాహ్న భోజనంలో సలాడ్ రూపంలో కీరదోస తినడం మంచిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం త్వరగా జీర్ణం కావడానికి కూడా సహాయపడుతుంది. వేసవిలో కీరదోస శరీరాన్ని చల్లగా, హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. మధ్యాహ్నం కీరదోస తినడం వల్ల బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఇది కడుపును నిండుగా ఉంచుతుంది. అతిగా తినకుండా నిరోధిస్తుంది. మధ్యాహ్న భోజనంలో దోసకాయ, టమోటా, క్యారెట్ సలాడ్ తయారు చేసి తినవచ్చు. రాత్రిపూట తేలికపాటి భోజనం తినాలనుకుంటే, కీరదోస తినవచ్చు. ఇందులో 90 శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. అయితే, రాత్రిపూట కీరదోస ఎక్కువగా తినడం వల్ల గ్యాస్ సమస్యలు వస్తాయి. చల్లని ఆహారాలతో సమస్యలు ఉంటే, రాత్రిపూట కీరదోస తక్కువగా తినడం బెటర్. రాత్రి భోజనం చేసిన వెంటనే దోసకాయలు తినకపోవడమే మంచిది. అది అజీర్ణానికి కారణం కావచ్చు. ఇందులో తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకం, గ్యాస్ సమస్యలను తొలగించి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దోసకాయలలోని యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతాయి. చర్మాన్ని ప్రకాశవంతం చేస్తాయి. అదనంగా, కీరదోస రక్తపోటును నియంత్రిస్తుంది. ఎందుకంటే ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును సమతుల్యం చేయడంలో సహాయపడతాయి.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక



# నేను దయ్యాన్ని కాదు

తొలిఅడుగు, సినిమా : హార్రర్ సినిమాల్లో దయ్యాల పాత్రలు పోషించిన కథానాయికలు చాలామందే ఉన్నారు. ఒకప్పుడంటే దయ్యాల పాత్రలు చేయడానికి స్టార్ హీరోయిన్లు వెనుకంజ వేసేవారు కానీ.. 'చంద్రముఖి' తర్వాత పరిస్థితి మారిపోయింది. అందులో జ్యోతిక దయ్యం పాత్రలో అద్భుత అభినయంతో ప్రశంసలు అందుకోవడంతో మంచి పెర్ఫామెన్స్ ఇవ్వడానికి ఈ పాత్రలు మంచి ఛాయిస్ అని హీరోయిన్లు భావించి వీటికి ఓకే చెప్పడం కామన్ అయింది. నయనతార, తమన్నా సహా ఎంతోమంది స్టార్ హీరోయిన్లు దయ్యాల పాత్రలు పోషించారు. ప్రస్తుతం తెలుగులో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాజా సాబ్'లో ప్రభాస్ సైతం దయ్యంగా కనిపించనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇందులో హీరోయిన్ నిధి అగర్వాల్ సైతం దయ్యం క్యారెక్టర్ చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. కానీ ఆ ప్రచారాన్ని నిధి ఖండించింది. తాను 'రాజా సాబ్'లో చేస్తున్నది దయ్యం క్యారెక్టర్ కాదని ఆమె స్పష్టం చేసింది. వినోదాత్మకంగా సాగే ఈ చిత్రంలో తన పాత్ర అందరినీ ఆశ్చర్యపరుస్తుందని ఆమె చెప్పింది. అదే సమయంలో అది రెగ్యులర్ గ్లామర్ క్యారెక్టర్ కాదని చెప్పిన నిధి.. ఇందులో పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉంటుందని నిధి తెలిపింది. ఇక తాను నటిస్తున్న మరో భారీ చిత్రం హరిహర వీరమల్లు గురించి నిధి మాట్లాడుతూ.. "ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా. పవన్ కళ్యాణ్ గారితో నటించడం ఎప్పటికీ మరిచిపోలేని అనుభవం. ఆయన ఒక మేధావి. సాహిత్యం మీద ఎంతో పట్టు ఉంది. పవన్ గారు డిప్యూటీ సీఎం కాకముందే ఆయనతో షూటింగ్ చేశాను.

# ఇంత ప్రేమేంటి బోనీ సాబ్



తొలిఅడుగు, సినిమా : ప్రపంచంలో ఎవరికైనా కన్నబిడ్డల తర్వాతే ఏదైనా. దీనికి సినిమా హీరోలు, నిర్మాతలు ఎవరూ మినహాయింపు కాదు. బోనీ కపూర్ దాన్ని రుజువు చేసే పనిలో ఉన్నారు. పెద్దమ్మాయి జాన్వీ కపూర్ కెరీర్ దక్షిణాదికి వచ్చాక సెట్టయిపోయింది. వరసగా జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లతో ప్యాన్ ఇండియా ప్రాజెక్టులు పట్టేసింది. అల్లు అర్జున్, నాని తర్వాతి సినిమాలకు ఆమెనే పరిశీలిస్తున్నారు. హిందీలో ఎన్ని చేసినా ఎంత బాగా నటించినా రాని పేరు తెలుగులో రావడం విశేషం. ఇప్పుడు టాపిక్ తన గురించి కాదు. జాన్వీ చెల్లెలు ఖుషి కపూర్ మీద సోషల్ మీడియాలో ఎలాంటి ఫీడ్ బ్యాక్ ఉందో తెలిసిందే. ఖుషివి ఇప్పటిదాకా మూడు సినిమాలొచ్చాయి. మొదటిది ఆర్చీస్ ఓటిటిలో అయినా సరే డిజాస్టర్ అందుకుంది. నటనకు ఎలాంటి కాంప్లిమెంట్స్ రాలేదు. రెండోది లవ్ యాపా. తమిళ బ్లాక్ బస్టర్ లవ్ టుడేని రీమేక్ చేస్తే దక్కిన ఫలితం సున్నా. ఇటీవలే నెట్ ఫ్లిక్స్ లో సైఫ్ కొడుకు ఇబ్రహీం నాదానియాన్ లో దర్శనమిచ్చింది. ఇది ఏకంగా ట్రోలింగ్ మెటీరియల్ అయిపోయి ఖుషి కపూర్ మీద మాములు నెగటివిటీ రాలేదు. అయినా సరే ఖుషితో మామ్ 2 తీస్తానని బోనీ కపూర్ ప్రకటించారు. దివంగత శ్రీదేవి చివరి సినిమాగా 2017లో రిలీజైన మామ్ మంచి క్రైమ్ రివెంజ్ డ్రామాగా బాక్సాఫీస్ వద్ద హిట్ సాధించింది. ఇప్పుడు దానికి కొనసాగింపు అంటే పెద్ద రిస్కే. ఎందుకంటే మామ్ సీరియస్ సబ్జెక్టు. ఖుషి కపూర్ నుంచి పెర్ఫార్మన్స్ పరంగా చాలా డిమాండ్ ఉంటుంది.

# నాని నమ్మకానికి ప్రీమియర్ల పరీక్ష



తొలిఅడుగు, సినిమా : నిర్మాతగా నాని విపరీతమైన నమ్మకం పెట్టుకున్న కోర్ట్ ఇంకో మూడు రోజుల్లో విడుదల కానుంది. ఇంతకు ముందు ప్రొడ్యూసర్ గా అ!, హిట్ 1, హిట్ 2 తీసినప్పటికీ ఇప్పుడు చూపిస్తున్న కాన్ఫిడెన్స్ వేరే స్థాయిలో ఉంది. రెండు రోజుల ముందే ప్రీమియర్లకు రెడవుతున్నాడు. మీడియాకు, ప్రేక్షకులకు విడివిడిగా రేపటి నుంచే ప్లాన్ చేస్తున్నారని సమాచారం. కోర్ట్ లో ఎలాంటి స్టార్ క్యాస్టింగ్ లేదు. ప్రియదర్శి, సాయికుమార్, హర్షవర్ధన్, రోహిణీ లాంటి నోటెడ్ ఆర్టిస్టులున్నారు కానీ కంటెంట్ పరంగా ఇలాంటి కాన్సెప్ట్ లు కమర్షియల్ జనాలకు అంత సులభంగా రీచ్ కావు. కానీ నాని లెక్కలు వేరే ఉన్నాయి. ఎంత కోర్ట్ రూమ్ డ్రామా అయినా సరే మాస్ ని మెప్పించే ఎన్నో అంశాలు ఇందులో ఉన్నాయని నమ్ముతున్నాడు. నచ్చకపోతే నా హిట్ 3 చూడొద్దని పిలుపు ఇవ్వడం ఆల్రెడీ ఫ్యాన్స్ లో హాట్ టాపిక్ అయ్యింది. నిజానికి మార్చి 14 మంచి స్లాట్. పరీక్షల సీజన్ అయినా సరే సాధారణ ప్రేక్షకులకు బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ఆప్షన్లు లేవు, ఛావా ఒకటే స్టడీగా ఉండగా రిటర్న్ అఫ్ ది డ్రాగన్ ఫైనల్ రన్ కు దగ్గరలో ఉంది. మజాకా చాప్టర్ ముగిసిపోయింది. కిరణ్ అబ్బవరం దిల్ రుబా ఒకటే పోటీలో ఉంది. కాకపోతే రెండు సినిమాలు సంబంధం లేని జానర్లు కావడంతో కాంపిటీషన్ అనుకోవడానికి లేదు. సో నాని నమ్మకానికి ప్రీమియర్లు పెద్ద పరీక్షే పెట్టబోతున్నాయి. టాక్ ఖచ్చితంగా పాజిటివ్ గా వస్తేనే తను అన్న మాటలకు వెయిట్ వస్తుంది. ట్రైలర్ చూశాక కనివిని చూడనిది అందులో కనిపించలేదు కానీ అసలైన కంటెంట్ కట్టిపడేసేలా ఉంటుందని నాని బలంగా నమ్ముతున్నాడు. ప్రమోషన్లు దగ్గరుండి చూసుకుంటున్నాడు.

# వెంకీ.. నెక్స్ట్ సినిమా ఎవరితో

తొలిఅడుగు, సినిమా : సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ ఈ సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో సెన్సేషనల్ హిట్ కొట్టారు. మిడ్ రేంజ్ బడ్జెట్లో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ మూవీ ఏకంగా రూ.300 కోట్ల వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను షాక్‌కు గురి చేసింది. చాలా ఏళ్లుగా నంబర్స్ గేమ్‌లో బాగా వెనుకబడిపోయిన వెంకీ.. ఈ చిత్రంతో తన సత్తాను చూపించారు. దీంతో ఆయన తర్వాత చేయబోయే సినిమా పట్ల అభిమానుల్లో అమితాసక్తి నెలకొంది. ఐతే వెంకీ ఒక ఫామ్‌లో లేని దర్శకుడితో జట్టు కట్టబోతున్నట్లు వార్తలు రావడంతో ఫ్యాన్స్ కొంచెం షాకయ్యారు. ఆ దర్శకుడే సురేందర్ రెడ్డి. ఒకప్పుడు అతనొక్కడే, కిక్, రేసు గుర్రం లాంటి బ్లాక్ బస్టర్లు ఇచ్చిన సురేందర్‌కు చాలా ఏళ్లుగా సరైన విజయం లేదు. చివరి చిత్రం 'ఏజెంట్' పెద్ద డిజాస్టర్ అయింది. దాని కంటే ముందు చేసిన 'సైరా' ఓ మోస్తరుగా ఆడింది. అంతకుముందు తీసిన 'కిక్–2' కూడా డిజాస్టరే. 'ఏజెంట్' తర్వాత అడ్రస్ లేకుండా పోయిన సురేందర్.. వెంకీ కోసం ఒక యాక్షన్ ఎంటర్టైనర్ కథ రెడీ చేశాడని.. వెంకీ కూడా ఈ సినిమా చేయడానికి సుముఖంగానే ఉన్నాడని వార్తలు వచ్చాయి. ఐతే 'సంక్రాంతికి వస్తున్నాం'తో మంచి ఊపుమీదున్న వెంకీ.. ఫాంలో లేని సూరితో జట్టు కట్టడం అవసరమా.. అయినా తన శైలిలో ఫ్యామిలీ ఎంటర్టైనర్లు చేసుకోక, యాక్షన్ సినిమాలు ఎందుకు అనే ప్రశ్నలు తలెత్తాయి. ఐతే ఇంకా ఆ ప్రాజెక్టు కన్ఫమ్ కాకముందే.. ఇప్పుడు వెంకీ అభిమానులను కంగారు పెట్టే మరో న్యూస్ తెరపైకి వచ్చింది. గతంలో వెంకీతో 'లక్ష్మీ' సినిమా తీసిన సీనియర్ దర్శకుడు వి.వి.వినాయక్ మళ్లీ ఆయనకో కథ చెప్పారని.. సంప్రదింపులు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది.



# మరో రికార్డుకు అడుగు దూరంలో కోహ్లీ




తొలిఅడుగు, న్యూఢిల్లీ: టీం ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ రికార్డులకు పెట్టింది పేరు. ఇప్పటికు ఎవరికి సాధ్యం కానీ రికార్డులను తన పేరిట రాసుకున్నాడు కోహ్లీ. అయితే ఇప్పుడు మరో రికార్డుకు అడుగు దూరంలో ఉన్నాడ్డు కోహ్లీ. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. మార్చి 22న కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. ఈ టోర్నమెంట్ కోసం ఇప్పటికే అన్ని జట్లు కసరత్తులు చేస్తున్నాయి. అయితే ఈ సీజన్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును అందుకొనే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో మరో సెంచరీ చేస్తే.. టీ-20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసి భారత క్రికెటర్‌గా కోహ్లీ నిలుస్తాడు. ఈ జాబితాలో కోహ్లీ అగ్రస్థానంలోనే ఉన్నాడు. ఇప్పటికే కోహ్లీ 399 మ్యాచుల్లో 9 సెంచరీలు చేయగా.. రోహిత్ శర్మ 448 మ్యాచ్‌లు ఆడి 8 సెంచరీలు చేశాడు. కోహ్లీ ఎనిమిది సెంచరీలు ఐపీఎల్‌లో చేయగా.. 1 సెంచరీ అంతర్జాతీయ క్రికెట్‌లో చేశాడు. ఈ సీజన్‌లో ఒకటి లేదా ఎక్కువ సెంచరీలు చేస్తే.. కోహ్లీ తన రికార్డును తానే బ్రేక్ చేసే అవకాశం ఉంది.

# బెంగళూర్ ప్రధాన కోచ్ దినేశ్ కార్తీక్




తొలిఅడుగు, ఐపిఎల్‌లో మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రధాన కోచ్ దినేశ్ కార్తీక్ పేర్కొన్నాడు. కిందటి సీజన్‌లో బెంగళూరు టీమ్‌లో ఆటగాడిగా కొనసాగిన కార్తీక్ ఈసారి కోచ్ అవతారమెత్తాడు. ఈ క్రమంలో ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించాడు. ఐపిఎల్ ఆరంభం నుంచి ఆడుతున్నా తమకు ట్రోఫీ అందని ద్రాక్షగానే ఉందన్నాడు. ఈసారి ఆ లోటును పూడ్చుకోవాలని భావిస్తున్నట్టు వివరించాడు. దీని కోసం సమష్టిగా ముందుకు సాగుతామన్నాడు. ఆటగాడిగా పోల్చితే కోచ్ పదవి చాలా క్లిష్టమైందన్నాడు. అయితే తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చాడు. క్రికెటర్‌గా ఉంటే జట్టులో సేవ చేసేందుకు ఎంతో మంది సిద్ధంగా ఉంటారు. కానీ కోచ్‌గా బాధ్యతలను నిర్వర్తించేటప్పుడు ప్రతిది తామే చేయాల్సి ఉంటుంది. ఒక మాటలో చెప్పాలంటే కోచ్ పదవి సెల్ఫ్ సర్వీస్ లాంటిది. ఇక్కడ మన బాధ్యత మనమే నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతం తాను కూడా కోచ్ పదవిని చేపట్టా. దీని చాలా కీలకమైన బాధ్యత. మెగా వేలం తర్వాత బెంగళూరు టీమ్‌పై పూర్తి దృష్టి సారించా. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు కూర్పు ఎలా ఉండాలనే దానిపై ఇప్పటికే ఓ స్పష్టత వచ్చింది. ఐపిఎల్ వంటి మెగా టోర్నమెంట్‌లో ప్రతి జట్టు బలమైనదే. అన్ని జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఇలాంటి స్థితిలో జట్టును గెలుపు బాటలో నడిపించడం చాలా కష్టంతో కూడుకున్న అంశం. అయితే విరాట్ కోహ్లిలాంటి సీనియర్ ఆటగాడు జట్టులో ఉండడం తమకు సానుకూల పరిణామం. యువ కెప్టెన్ రజత్ పటిదార్‌లో అపార నాయకత్వ ప్రతిభ దాగివుంది. జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే టోర్నమెంట్‌లో మెరుగైన చేయడం కష్టమేమీ కాదు. ఈసారి ఐపిఎల్‌లో హోరాహోరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది. అన్ని జట్లు కూడా ట్రోఫీపై కన్నేశాయి. ప్రతి జట్టులోనూ అగ్రశ్రేణి ఆటగాళ్లు ఉన్నారు. స్వదేశీ, విదేశీ క్రికెటర్ల కలయికతో అన్ని జట్లు బలోపేతంగా మారాయి. దీనికి తోడు అన్ని జట్లలోనూ సీనియర్ కోచ్‌లు ఉన్నారు. దీంతో పోటీ సువ్వానేనా అన్నట్టు సాగడం తథ్యం. తాము మాత్రం కలిసికట్టుగా ఆడుతూ లక్ష్యం దిశగా అడుగులు వేస్తామని కార్తీక్ పేర్కొన్నాడు.

# ఢిల్లీకి మూడోసారి నిరాశే..



తొలిఅడుగు, న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపిఎల్) టైటిల్‌ను ముద్దాడాలన్న ఢిల్లీ కలలు మరోసారి కల్లలయ్యాయి. 2023, 2024 సీజన్‌లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌కే పరిమితమైన ఢిల్లీ జట్టు.. శనివారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన సీజన్-3 ఫైనల్లోనూ ఎనిమిది పరుగుల తేడాతో ఓటమిపాలైంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ భరితంగా సాగిన టైటిల్ సంగ్రామంలో ముంబయి చేతిలో ఢిల్లీ ఓటమిపాలైంది. ఛేదనలో భాగంగా చివర 3ఓవర్లలో 29పరుగులు చేయాల్సిన ఢిల్లీని స్కీవర్ బ్రంట్ వరుస బంతుల్లో మారిజానే కాప్(40), శిఖా పాండే(0)ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత మాథ్యూస్ ఢిల్లీ ఆల్‌రౌండర్ మిన్ను మణి ఔటైంది. మరోవైపు నిక్కి ప్రసాద్(25నాటౌట్) ధాటిగా ఆడినా.. చివరి ఓవర్లో స్కీవర్ బ్రంట్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయ డంతో ఢిల్లీ గెలుపు తీరాలకు చేరలేకపోయింది. మారిజన్నె క్యాప్(40), జెమ్మీమా రోడ్రిగ్స్(30), నికీ ప్రసాద్(25నాటౌట్) మినహా మిగతా బ్యాటర్లు క్రీజ్ ముందు నిలవలేక పోయారు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో నాట్ స్కివర్ బ్రంట్ మూడు, అమెలా కేర్ రెండు, షబ్నం ఇస్మాయిల్, హేలీ మ్యాథ్యూస్, సైకా ఇసాకీ చెరో వికెట్ తీశారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. సారథి హర్మన్ ప్రీత్ కౌర్ 66, నాట్ స్కివ్ బ్రంట్ 30 పరుగులు చేశారు.

# స్టార్స్‌కు చుక్కెదురు

తొలిఅడుగు, బీఎన్‌పీ పారిబస్ ఇండియన్ వెల్స్ ఓపెన్‌లో స్టార్ క్రీడాకారులకు చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్), ఐదో సీడ్ డానిల్ మెద్వదేవ్ (రష్యా)లకు సెమీఫైనల్లో పరాజయం ఎదురైంది. బ్రిటన్ ఆటగాడు, 13వ సీడ్ జేక్ డ్రాపర్ 6-1, 0-6, 6-4తో కార్లోస్ అల్కరాస్‌పై గెలుపొందాడు. నాలుగు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరిసిన డ్రాపర్.. టైటిల్ ఫేవరేట్‌ను సాగనంపాడు. పాయింట్ల పరంగా 72-67తో డ్రాపర్ పైచేయి సాధించాడు. మరో సెమీస్‌లో రష్యా స్టార్ డానిల్ మెద్వదేవ్‌కు భంగపాటు తప్పలేదు. 5-7, 4-6తో వరుస సెట్లలోనే 12వ సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) చేతిలో ఓటమి చెందాడు. నేడు టైటిల్ పోరులో డ్రాపర్, రూనె తలపడనుండగా.. మహిళల సింగిల్స్ టైటిల్ వేటలో సబలెంక, ఆంద్రీవ పోటీపడుతున్నారు.

# మళ్లీ ఓడిన పాకిస్థాన్




తొలిఅడుగు, ఇటీవలే ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలో ఘోర ఓటములతో గ్రూప్ దశలోనే ఇంటిదారిపట్టిన పాకిస్థాన్ ఆటలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20లో సైతం ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఘోర ఓటమిని దృష్టిని పెట్టుకుని పాక్ క్రికెట్ బోర్డు కివీస్ టూర్ కోసం జట్టులో మార్పులు చేసింది. కెప్టెన్ రిజ్వాన్, బాబర్ ఆజమ్ లాంటి ఆటగాళ్లను పక్కన పెట్టింది. అయినప్పటికీ ఎలాంటి ఫలితం దక్కలేదు. న్యూజిలాండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాక్ 18.4 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌట్ అయింది. న్యూజిలాండ్ గడ్డపై పాక్ కు ఇదే అత్యల్ప టీ20 స్కోర్. ఖుష్దిల్ షా 32(30), అఘా సల్మాన్ 18(20) పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ 4, కైల్ జామిసన్ మూడు వికెట్లు తీశాడు. ఆ తరువాత 92 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన కివీస్ జట్టు 10.1 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి టార్గెట్ ను ఫినిష్ చేసింది. టిమ్ సీఫెర్ట్ 44(29),ఫిన్ అలెన్ 29(17) పరుగులు చేసి జట్టును గెలిపించారు. దీంతో 9 వికెట్లతో విజయం సాధించి సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

# ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములా వన్




తొలిఅడుగు, ఫార్ములా వన్ సీజన్ తొలి రేసు నాటకీయ పరిణామాల నడుమ ఆద్యంతం ఉత్కంఠ రేపుతూ సాగింది. తొలి రెండు రోజులు విపరీత ఉష్ణోగ్రతలు డ్రైవర్లకు సవాల్ విసరగా.. ప్రధాన రేసుకు వరుణుడు రంగ ప్రవేశం చేశాడు. ఎడతెగని వర్షం, తడిసిన ట్రాక్‌పై పట్టు కోసం డ్రైవర్లు నానా తంటాలు పడ్డారు. ప్రమాదకర మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి డ్రైవర్లు ట్రాక్ తప్పారు. ఇన్ని అవాంతరాలను సమర్థవంతంగా దాటుకుంటూ మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (గ్రేట్ బ్రిటన్) టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు. నాలుగు సార్లు వరల్డ్ ఛాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ (బెల్జియం) రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 58 ల్యాప్‌ల ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ రేసును గంటా 42 నిమిషాల 06.304 సెకండ్లలో లాండో నోరిస్ రేసును ముగించాడు. నోరిస్ కంటే 0.895 సెకండ్ల తర్వాత రేసును పూర్తి చేసిన వెర్‌స్టాపెన్‌కు నిరాశ తప్పలేదు. మెక్‌లారెన్ మరో డ్రైవర్, లోకల్ స్టార్ ఆస్కార్ పియాస్ట్రి తొమ్మిదో స్థానంతో రేసును ముగించాడు. తొలిసారి దిగ్గజ రేసింగ్ జట్టు ఫెరారీ తరఫున బరిలో నిలిచిన లూయిస్ హామిల్టన్ పదో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానంలో నిలిచిన లాండో నోరిస్ 25 పాయింట్లను ఖాతాలో వేసుకుని డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌లో సైతం టాప్ ప్లేస్ సొంతం చేసుకున్నాడు. వెర్‌స్టాపెన్‌కు 18 పాయింట్లు, రస్సెల్ (మెర్సిడెస్) 15 పాయింట్లు దక్కాయి. ట్రాక్‌పై అవాంతరాలతో పలుమార్లు సేఫ్టీ కారు ట్రాక్‌పై చక్కర్లు కొట్టింది. నోరిస్ దూకుడు : ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ అర్హత రేసులో పోల్ పొజిషన్ సాధించిన లాండో నోరిస్.. రేసులోనూ అదే జోరు చూపించాడు. కాస్త ఆలస్యంగా ఆరంభమైన రేసులో ఆది నుంచి ముందంజలో కొనసాగాడు. 58 ల్యాప్‌ల (వలయాలు) రేసులో 44వ ల్యాప్ వద్ద కీలక పరిణామం చోటు చేసుకుంది. అప్పటివరకు నువ్వా నేనా అంటూ పోటీపడిన నోరిస్, ఆస్కార్ పియాస్ట్రి, వెర్‌స్టాపెన్‌లకు కీలక సవాల్ ఎదురైంది. 44వ ల్యాప్ 12వ మలుపు వద్ద నియంత్రణ కోల్పోయిన పియాస్ట్రి కారు పచ్చికపై చిక్కుకుంది. నోరిస్ కారు సైతం గులకరాళ్లపై నుంచి దూసుకెళ్లినా..గ్రేట్ బ్రిటన్ డ్రైవర్ ఎక్కువ సమయం వృథా కాకుండా చాకచక్యంగా ట్రాక్‌పైకి వచ్చాడు. ఈ సమయంలోనే వెర్‌స్టాపెన్ అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. 46వ ల్యాప్ తర్వాత మళ్లీ వేగం పుంజుకున్న నోరిస్.. టాప్ గేర్‌లోకి దూసుకెళ్లాడు. చివరి రెండు ల్యాప్‌ల్లో వెర్‌స్టాపెన్ వెంబడించగా.. నోరిస్ గెలుపు గీతను ముందుగానే దాటాడు. 25 ఏళ్ల లాండో నోరిస్ డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌లో ముందంజలో కొనసాగటం అతడి కెరీర్‌లోనే ఇది ప్రథమం. 'ఈ విజయం అద్భుతం. ఎంతో కఠిన రేసు. మాక్స్ వెర్‌స్టాపెన్ నా వెనకే ఉన్నాడు. చివరి రెండు ల్యాప్‌లకు ఒత్తిడికి లోనయ్యాను. సవాల్‌తో కూడిన పరిస్థితుల్లో అనూహ్య అవాంతరాలను ఎదుర్కొని రేసును ముగించటం సంతోషంగా ఉంది'